రేపు 'సుందరకాండ-హనుమత్ సీతా దర్శనం'పై ప్రవచనం

సనత్‌నగర్: హనుమాన్ జయంతి సందర్భంగా ఈనెల 22న మోడల్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'సుందరకాండ-హనుమత్ సీతా దర్శనం' ప్రవచనం ఉంటుందని కాలనీ ప్రధాన కార్యదర్శి బుచ్చిబాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తుర్లపాటి రవికృష్ణతో సాయంత్రం 6.30 గంటలకు కాలనీలోని సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో ప్రవచనాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. అంతకుముందు సాయంత్రం 5 గంటలకు స్వామి వారికి అభిషేకం, ఆకుపూజ, 6 గంటలకు 3 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.15, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 35, క్యాప్సికం 45, పచ్చకాకర 32, పందిరి బీర 45, క్యాబేజీ 13, క్యారెట్ 26, దొండ 23, గుండుబీన్స్ 85, గింజ చిక్కుడు 45, గోకరకాయ 35, కీర 23, దోసకాయ 18, బీట్‌రూట్ 17, ఉల్లిగడ్డ 16, ఆలుగడ్డ 25, చామగడ్డ 35, మొరంగడ్డ 18, కందగడ్డ 50, సొరకాయ 9, పొట్లకాయ 13, అరటికాయ 11, మునగకాయ 3-4, ముల్లంగి 5-6. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమల్లో ఉంటాయి.

ప్రకాశం పంతులుకి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలత తదితరులు

లాలాపేట: తార్నాకలోని డిప్యూటీ మేయర్ నివాసంలో టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ మొదటి ముఖ్యమంత్రిగా ఎంతో అభివృద్ధి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో కోళ్ల వెంకటేశ్ యాదవ్, కోరెపాక అంజి తదితరులు ఉన్నారు.

సమ్మె కాలానికి వేతనంపై హర్షం



ఉస్మానియా యూనివర్సిటీ: సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన సమ్మె కాలానికి వేతనం చెల్లింపుపై వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు కాంట్రాక్టు అధ్యాపకులు సీఎం రేవంత్ రెడ్డి, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ.బాలకృష్ణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపి ప్రభుత్వ నూతన సీఎస్ రామాకృష్ణారావుకు మంగళవారం పుష్పగుచ్ఛం అందచేసి కృతజ్ఞతలు చెప్పారు. కార్యక్రమంలో డా.పరశురాం, డా.ధర్మతేజ, డా.రేష్మారెడ్డి, డా.తిరుపతి, డా.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్ పనులు ప్రారంభం



సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలోని బ్రాహ్మణ బస్తీ ఉజ్జయిని హైస్కూల్ వద్ద స్థానిక కార్పొరేటర్ సామల హేమ జలమండలి అధికారులతో కలిసి తాగునీటి పైప్‌లైన్ పనులను మంగళవారం ప్రారంభించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రూ.15 లక్షల పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ నవ్య, బీఆర్‌ఎస్ నాయకులు కరాటే రాజు, రాజ సుందర్, శైలేందర్, రవీందర్ సాగర్, కృష్ణ ముదిరాజ్, అశోక్, ప్రసాద్, లక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ సిబ్బందికి వేసవి సెలవులు వర్తింపజేయండి



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లో హాస్టల్స్ మూసివేశారని వేసవి సెలవులను సిబ్బందికి కూడా వర్తింపజేయాలని కోరుతూ హాస్టల్ సిబ్బంది చీఫ్ వార్డెన్ డా.కొర్రెముల శ్రీనివాస్‌రావుకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..సెలవుల కారణంగా హాస్టల్స్, మెస్‌లలో పని చేస్తున్న 382 మంది అవుట్ సోర్సింగ్ సిబ్బందితో రోడ్లను శుభ్రం చేయించడం ఇతర పనులు చేయించడం తగదన్నారు. వేతనంతో కూడిన సెలవులను ప్రకటించాలని సీఐటీయూ అధ్యక్షుడు టి.మహేందర్ కోరారు.

'సామాజిక సేవారత్న' అవార్డుల ప్రదానం



సేవారత్న అవార్డులతో మహిళా నాయకురాళ్లు

లాలాపేట: తెలంగాణ ప్రభుత్వం అంబేద్కర్ 134వ జయంతి ఉత్సవాల కమిటీ 2025 ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకురాలు, మాదిగ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మేరీ మాదిగ సామాజిక సేవా రత్న అవార్డును అందుకున్నారు. క్లాసిక్ గార్డెన్‌లో సోమవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్ ఇటుక రాజు మేరీ మాదిగను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. మేరీ మాదిగ ఉమ్మడి రాష్ట్రంలో, తెలంగాణలో మాదిగ జాతి హక్కుల సాధన, ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో అలుపెరుగని పోరాటాలు చేసి, జైలు జీవితాన్ని సైతం అనుభవించింది. సేవారత్న, దళిత రత్న అవార్డు అందుకున్న వారిలో దేవని సుగుణ మాదిగ, కందుల ధనలక్ష్మి, బాణాల లావణ్య, బొజ్జ ప్రణతి తదితరులు ఉన్నారు. అవార్డులు అందజేసిన రాష్ట్ర ప్రభుత్వం, ఉత్సవ కమిటీ నాయకులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

మైనార్టీలకు బడ్జెట్ కేటాయించాలి



రాష్ట్ర ప్రభుత్వానికి రాసిన లేఖ చూపుతున్న నాయకులు

లాలాపేట: మైనార్టీలకు సబ్‌ప్లాన్ రూపంలో బడ్జెట్ కేటాయించాలని సమాజ్‌వాది పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ సింహాద్రి అన్నారు. తార్నాకలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ సెక్రటరీ మహమ్మద్ ముజాహిద్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ముస్లింలతో పాటు మిగతా మైనార్టీలు దాదాపు 15 శాతం ఉన్నప్పటికీ ప్రభుత్వం బడ్జెట్‌లో వారికి ఎలాంటి మేలు చేకూర్చలేదన్నారు. అలాగే పంచాయతీరాజ్ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ కేంద్ర ప్రభుత్వానికి పంపిన చట్టాన్ని అమలు చేసిన తర్వాతే ఎన్నికలకు వెళ్లాలని సూచిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి పార్టీ నాయకులు రాసిన లేఖను విడుదల చేశారు.

సైంటిఫిక్ ఆఫీసర్ ప్రకాశ్‌కు ఓయూ డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ జియాలజీ విభాగం నుంచి డా.ప్రకాశ్‌కు పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. యూనివర్సిటీ సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొ.ప్రభాకర్ పర్యవేక్షణలో తెలంగాణ రాష్ట్రం జనగామ జిల్లా, రఘునాథపల్లి వాటర్ షెడ్‌లో భూగర్భ జలాలు, ఉపరితల జల నిర్వహణ కోసం ఇంటిగ్రేట్ రిమోట్ సెన్సింగ్ , జీఐఎస్ అధ్యాయనాలు అనే అంశంపై పరిశోధనకు డాక్టరేట్ లభించినట్లు తెలిపారు. గతంలో ఆయన జల్ నిర్మల్ ప్రాజెక్టు (కర్ణాటక), రాజీవ్ గాంధీ తాగునీటి మిషన్ (ఏపీ, తెలంగాణ) పనిచేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళిక విభాగం అనుబంధంగా ఉన్న తెలంగాణ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్స్ సెంటర్ (టీజీఆర్ఏసీ)లో సైంటిఫిక్ ఆఫీసర్‌గా ప్రస్తుతం పని చేస్తున్నట్లు తెలిపారు. తన పరిశోధనకు సహకరించిన వారికి డా.ప్రకాశ్ కృతజ్ఞతలు తెలిపారు.

అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలి



ఎమ్మెల్సీ కోదండరాంతో గిరిజన శక్తి నాయకులు

లాలాపేట: రాష్ట్రంలోని బీఈడీ, డైట్ కాలేజీల్లో ఖాళీ అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలని గిరిజన శక్తి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ భూక్యా రాజారాం నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు తార్నాకలో ఎమ్మెల్సీ కోదండరాంను మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 10 డైట్ కళాశాలల్లో కళాశాలకు చొప్పున సుమారు 18 మంది అధ్యాపకులు ఉండాల్సి ఉండగా ఒకరిద్దరితోనే కొనసాగిస్తున్నారన్నారు. దాదాపు 110 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు. ఇప్పటికైనా విద్యారంగం బలోపేతానికి ప్రభుత్వం చర్యలు తీసుకునేలా చూడాలని సంఘం నాయకులు కోదండరాంను కోరారు. కార్యక్రమంలో గిరిజన శక్తి సంఘం నాయకులు ఉన్నారు.

'విద్యాసంస్థల్లో బీసీ రిజర్వేషన్లు అమలు చేయండి'



ఉస్మానియా యూనివర్సిటీ: ఈ విద్యా సంవత్సరం నుంచే బీసీ విద్యార్థులకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఓయూ జేఏసీ నాయకులు కోరారు. ఈమేరకు బీసీ వెల్ఫేర్ సెక్రటరీ శ్రీధర్‌ను మంగళవారం కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డిగ్రీ, పీజీ, లా, ఇంజినీరింగ్, ఇతర వృత్తి విద్య కోర్సుల్లో ప్రవేశాలకు బీసీలను ఎ, బి, సి, డి గ్రూపులను వర్తింప చేస్తూ రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. అలాగే ఫీజు రీయింబర్స్‌మెంట్ పెంచాలని, 10 వేల లోపు ర్యాంక్ నిబంధనను రద్దు చేసి అందరికీ ఉపకార వేతనాలు అందించాలని పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని, వర్సిటీల్లో ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. కులాలతీతంగా రెండు విడతలుగా మార్చి, నవంబర్‌లో రూ.5 వేలను ఉపకార వేతనంగా చెల్లించాలని, ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీల హాస్టల్స్‌లో దోపిడీని అరికట్టాలని వినతి పత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. అందించిన వారిలో చైర్మన్ బొడ్డుపల్లి లింగన్న, జేఏసీ అధ్యక్షుడు మన అశోక్ యాదవ్, కన్వీనర్ రవీంద్రనాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ చిరంజీవి పాల్గొన్నారు.

ఆర్‌టీఐ సభ్యులుగా బీసీలను నియమించండి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషన్ సభ్యులుగా ముగ్గురు బీసీలను నియమించాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాసినట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ప్రధాన కమిషనర్, ఐదుగురు సభ్యుల్లో ఒక్క బీసీ లేకపోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభాలో అత్యధికంగా 52 శాతం మంది గల బీసీలను పాలన పదవులకు దూరంగా పెట్టడం తగదని పేర్కొన్నారు. బీసీలకు విద్య, ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ నిచ్చిన సీఎం సమాచార కమిషన్‌లో ఒక్క బీసీని నియమించకపోవడం తగదని పేర్కొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఆటో డ్రైవర్ అరెస్టు

సనత్‌నగర్: గంజాయి విక్రయిస్తున్న ఓ ఆటో డ్రైవర్‌ను సనత్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫతేనగర్ ఇందిరాగాంధీపురంలోని ఎండీ షాహెబాజ్ షుకూర్ (27) అనే ఆటోడ్రైవర్ ఇంట్లో గంజాయి నిల్వ ఉన్నట్లు సమాచారం మేరకు పోలీసులు సోమవారం సాయంత్రం దాడులు చేశారు.మహారాష్ట్రలోని పర్భానీ ప్రాంతం నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి ఇక్కడ విక్రయిస్తున్నట్లుగా పోలీసుల విచారణలో తేలింది. ఇదే క్రమంలో 2రోజుల క్రితం అక్కడి నుంచి రూ.30వేలతో 2కిలోల గంజాయిని కొనుగోలు చేసి సోమవారం ఉదయం రైల్‌లో ఫతేనగర్‌లో దిగి ఇందిరాగాంధీ పురానికి తీసుకువచ్చినట్లుగా పోలీసులు గుర్తించారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సులభంగా సంపాదించవచ్చని 6నెలలుగా గంజాయి విక్రయిస్తున్నట్లు నిందితుడు పోలీసులకు తెలిపాడు.ఈ మేరకు పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి కేజీ, 700 గ్రాములు ఉన్న రెండు గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ద్విచక్ర వాహనం అపహరణ

సనత్‌నగర్: ద్విచక్ర వాహనం అపహరణకు గురైన ఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బేగంపేట ప్రకాశ్‌నగర్‌లో ఉండే నందనూరి నరేందర్ ఈనెల 3న రాత్రి 11.30 గంటలకు ఫతేనగర్ రామాయలం ఎదుట తన స్నేహితుడి ఇంట్లో ఫంక్షన్‌కు వెళ్లాడు. ఇంటి ముందే తన ద్విచక్ర వాహనం పార్కు చేశాడు. తిరిగి వచ్చి చూసేసరికి కనిపించలేదు. చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చైల్డ్ పోర్న్ వీడియోలు డౌన్‌లోడ్ చేసిన బాలుడిపై కేసు నమోదు

సనత్‌నగర్: చిన్నారులపై జరిగే లైంగిక వేధింపుల వీడియోలను డౌన్‌లోడ్ చేసుకుని మెయిల్ ద్వారా ఫార్వర్డ్ చేసిన ఓ బాలుడిపై సనత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. సనత్‌నగర్ ప్రాంతానికి చెందిన బాలుడు (17)పిల్లలపై జరిగే లైంగిక వేధింపుల వీడియోను మెయిల్ ద్వారా ఫార్వర్డ్ చేశారు. ఇలాంటి సంఘటనలపై నిఘా పెట్టే సీఎంటీ/ఎన్‌సీఆర్‌పీ అధికారులు దీనిని గుర్తించి సనత్‌నగర్ పోలీసులకు సమాచారం అందించారు. దీనిపై స్పందించిన పోలీసులు సదరు బాలుడిపై కేసు నమోదు చేశారు.

అక్రమంగా వ్యాపారం చేస్తే చర్యలు



మార్కెట్ యార్డులో తనిఖీ చేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్, సెక్రటరీ

కంటోన్మెంట్: బోయిన్‌పల్లిలోని అంబేద్కర్ కూరగాయల మార్కెట్ యార్డులో లైసెన్స్ లేకుండా వ్యాపారం చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చైర్మన్ ఆనంద్ బాబు హెచ్చరించారు. మార్కెట్ యార్డు ఆవరణలో మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మార్కెటింగ్ శాఖ నుంచి 170 మంది కమిషన్ ఏజెంట్లకు మాత్రమే లైసెన్సులు ఉండగా, బినామీ పేర్లతో 400 మందికి పైగా వ్యాపారాలు చేస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయన్నారు. దీంతె ఇటీవల కమిషన్ ఏజెంట్లతో నిర్వహించిన సమావేశంలో బినామీ వ్యాపారాలను వెంటనే నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేశామని అయినప్పటికీ క్రయ, విక్రయాలు జరుపుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీంతో మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ వెంకన్న, కమిటీ వైస్ చైర్మన్ డీబీ దేవేందర్, కమిటీ సభ్యులతో కలిసి యార్డులోని పలు దుకాణాలను సందర్శించి క్రయ, విక్రయాలు చేస్తున్న వ్యక్తుల గురించి ఆరా తీశామన్నారు. లైసెన్స్‌దారుల పేరిట ఇతరులు వ్యాపారాలు చేస్తున్నట్లు తేలడంతో తగిన చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ శాఖ అధికారులకు సూచించారు. లైసెన్స్‌డు వ్యాపారుల వద్దే కూరగాయలు విక్రయించాలని రైతులకు సూచించారు.

అతిథి అధ్యాపకులను కొనసాగించండి

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రభుత్వ డిగ్రీ కాలేజీల అతిథి అధ్యాపకులను 2025-26 విద్యా సంవత్సరానికి కూడా రెన్యువల్ చేసి కొనసాగించాలని తెలంగాణ డిగ్రీ లెక్చరర్ల ఫోరం (టీడీఎల్ఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు డా.కిశోర్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని మంగళవారం డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 132 ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు ఉన్నాయని, అయితే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా 6 వేల మంది అధ్యాపకులు ఉండాల్సి ఉండగా 4098 మంది మాత్రమే ఉన్నారని పేర్కొన్నారు. అతిథి అధ్యాపకులుగా పని చేస్తున్న 1940 మందిని రెన్యువల్ చేస్తే విద్యార్థులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.

ఆశ్రిత స్వచ్ఛంద సంస్థకు జాతీయ అవార్డు

బన్సీలాల్‌పేట్: బాలల హక్కుల పరిరక్షణకు పని చేస్తున్న ఆశ్రిత స్వచ్ఛంద సంస్థకు జాతీయస్థాయి అవార్డు లభించింది. అమెరికాలోని వరల్డ్ లా కాంగ్రెస్ వరల్డ్ జురియస్ట్ అవార్డు అందుకున్న ఏకైక భారతీయుడు ఆశ్రిత సంస్థ నిర్వాహకుడు నాగరాజ్.ఢిల్లీలో జరిగిన సమావేశంలో జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ వ్యవస్థాపకుడు భువన్‌రిభ చేతుల మీదుగా నాగరాజు అవార్డును అందుకున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాలలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలల అక్రమ రవాణాను అరికట్టడం వంటి కార్యక్రమాలకు గాను అవార్డు లభించిందని ఇది తన బాధ్యతను మరింత పెంచిందన్నారు.

'విద్యార్థిపై దాడి హేయం'

ఉస్మానియా యూనివర్సిటీ: తిరుపతిలో ఈనెల 17న దళిత విద్యార్థిపై జరిగిన దాడిని ఓయూ విద్యార్థి నేతలు మంగళవారం తీవ్రంగా ఖండించారు. బీటెక్ విద్యార్థి జేమ్స్‌పై కొందరు మనువాద శక్తులు దాడి చేసి గాయపరచి మూత్ర తాగించడం హేయమైన చర్యగా తెలంగాణ రీసెర్చ్ అసోసియేషన్ అధ్యక్షుడు డా.ప్రేమ్‌కుమార్, బహుజన విద్యార్థి జేఏసీ చైర్మన్ వేల్పుల సంజయ్,ఓయూ విద్యార్థి జేఏసీ నాయకులు కొత్తపల్లి తిరుపతి, పేర్కొన్నారు. నిందితులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

యువతి అదృశ్యం



గౌరీధృవ్

చిలకలగూడ: యువతి అదృశ్యమైన ఘటన చిలకలగూడ ఠాణా పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని రాయ్‌పూర్‌కు చెందిన గౌరీధృవ్ (19)వృత్తిరీత్య భవన నిర్మాణ కార్మికురాలు. తల్లిదండ్రులతో కలిసి సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో గుడిసెల్లో నివసిస్తూ అక్కడే జరుగుతున్న వసతిగృహ నిర్మాణంలో పని చేస్తున్నారు. ఈనెల 19న మధ్యాహ్నం 3.30 సమయంలో బయటకు వెళ్లిన గౌరీధృవ్ తిరిగి ఇంటికి రాలేదు. స్వస్థలంతో పాటు పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లేకపోవడంతో తండ్రి యశ్వంత్‌ధృవ్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హముజా నాయక్ తెలిపారు.